మనం
కృష్ణా-గుంటూరు
ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల
శనివారం - 28- ఫిబ్రవరి - 2026 పేజీలు-6

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి:ప్రధాన కార్యదర్శి శ్యామలరావు



2

# విటిపిఎస్ ఒసిసి స్టోర్ కుంభకోణంలో విచారణకు హాజరు కావాలంటూ సభ్యులకు, ప్రతివాధులకు నోటీసులు




**ఇబ్రహీంపట్నం, పిబ్రవరి 27 (మనం న్యూస్)** విటిపిఎస్ ఒసిసి స్టోర్ కుంభకోణం లో కీలక మలుపు తీసుకుంది. ఈ నెల 23న తమ ఎదుట హాజరయి తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాలంటూ జిల్లా సహకార శాఖ నియమించిన విచారణ అధికారి అంజయ్య గతంలో ఒక నోటీసును విటిపిఎస్ ఒసిసి స్టోర్ కు, విటిపిఎస్ యాజమాన్యానికి పంపారు. ఆ నోటీసుకు విస్తృత ప్రచారం కల్పించాలని కూడా సదరు నోటీసులో కోరినట్లు తెలుస్తోంది. అయితే ఈ నోటీసు గురించి విటిపిఎస్ స్టోర్ వారు మీడియాకు ఇచ్చిన దాఖలాలు ఎక్కడా కనబడలేదు సరి కదా గతంలో విటిపిఎస్ ఒసిసి స్టోర్ లో అవకతవకలు జరిగాయంటూ గగ్గోలు పెట్టి జిల్లా సహకార శాఖ వారికి వ్రాత పూర్వకంగా పిర్యాదు చేసిన విటిపిఎస్ పాలక వర్గంలోని మాజీ సభ్యుడు శ్రీధర్ తమ అధ్యక్షుడు మల్లెన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకట రమణలు తీవ్ర స్థాయిలో దోపిడీలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు చేసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే మాజీ సభ్యుడు శ్రీధర్ సహకార శాఖ వారికి ఇచ్చిన పిర్యాదు మేరకు, పత్రికలలో వచ్చిన కథనాలతో పాటు విటిపిఎస్ హెచ్ పి ఆటోకేర్ లో విధులు నిర్వహిస్తున్న తల్లంగోపాల కృష్ణ అదృశ్య మయ్యాడంటూ అతని భార్య తన భర్త విషయంలో ఆంధోళన వ్యక్తం చేసినందుకు గాను జిల్లా సహకార శాఖ వారు 51 వ నోటీసును అనుసరించి నియమించిన విచారణ అధికారి అంజయ్య గత కొద్ది నెలలుగా విచారణ జరుపుతు న్నారు. అయితే ఈ వ్యవహారంలో ఈనెల 23న ఒసిసి స్టోర్స్ లో సభ్యత్వం కలిగిన స్టోర్స్ లో జరిగిన నిధుల దుర్వినియోగం, అవకత వకల గురించిన ఆధారాలను తనకు సమర్పించాలని ఆ నోటీసులో కోరారు. అయితే ఒసిసి స్టోర్ లో సభ్యత్వం కలిగిన వారు ఎంతమంది విచారణ అధికారికి ఆధారాలు సమర్పించారనేది తెలియాల్సి ఉంది. ఆధారాలు సమర్పిం చాలనుకున్న వారు కేవలం తాము ఒసిసి స్టోర్ లో సభ్యత్వం కలిగిఉన్నట్లు గుర్తింపు కార్డును చూపాలని, విటిపిఎస్ లో ఉద్యోగి అనే గుర్తింపు కార్డును కూడా చూపాలనే నిబంధనలను ఆ నోటీసులో పేర్కొన్నారు. పైన తెలిపిన రెండు రకాల గుర్తింపు కార్డులు లేని వారు విచారణ అధికారికి ఎటువంటి ఆధారాలు ఇచ్చినా గానీ అవి పరిగనలోకి తీసుకోబడవని అందులో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

**మార్చి9న విచారణకు హాజరు కావాలంటూ తల్లంగోపాల కృష్ణకు నోటీసు.**

అయితే తల్లం గోపాల కృష్ణ హెచ్ పి ఆటో కేర్ సెంటర్ లో విధులు నిర్వహించే క్రమంలో పెద్దం మొత్తంలో నగదును తీసుకుని పరారీ అయ్యారని హెచ్ పి ఆటో కేర్ సెంటర్ లో సూపర్ వైజర్ గా విధులు నిర్వహించే ప్రవీణ్ అనే వ్యక్తి స్థానిక ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేశారు. అయితే న భర్తలను ఒసిసి స్టోర్ వారే మాయం చేశారంటూ తల్లం గోపాలకృష్ణ భార్య ఆరోపించారు. ఈ రెండు వాధనలలో ఏది నిజమో అర్దం కాక పోలీసులు తలలు పట్టుకున్నారు. ఉత్కంఠకు తెర దించుతూ కొద్ది రోజుల వ్యవదిలో తల్లం గోపాల కృష్ణ పోలీసుల ఎదుట హాజరయ్యారు. దీంతో తల్లం గోపాల కృష్ణ అదృశ్య వాధన సర్దుమణిగింది. అయితే మార్చి 9న తల్లం గోపాల కృష్ణ విచారణ అధికారి ఎదుట హాజరయి తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తారా..? లేదా అనేది తెలియాల్సి ఉంది.



## శ్రీ కనకదుర్గమ్మ మహాకుంభాభిషేకానికి కంచి పీఠాధిపతులకు ఆహ్వానం

**విజయవాడ ఇంద్రకీలాద్రి ఫిబ్రవరి 27 (మనం న్యూస్) :** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో త్వరలో నిర్వహించ తలపెట్టిన అత్యంత పవిత్రమైన 'మహాకుంభాభిషేక' మహోత్సవానికి సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమానికి కంచి కామకోటి పీఠాధిపతులను ఆహ్వానించేందుకు దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మరియు ఆలయ కార్యనిర్వహణాధికారి (జు.నా) వి.కె. సీనా నాయక్ కంచి పుణ్యక్షేత్రానికి వెళ్లారు. ఈ సందర్భంగా కంచి మహాస్వామి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారిని మర్యాదపూర్వకంగా కలిసి, పాదాభివందనం చేసి మహాకుంభాభిషేక ఆహ్వాన పత్రికను అందజేశారు. అమ్మవారి ఆశీస్సులతో జరగనున్న ఈ మహాక్రతువుకు విచ్చేసి భక్తులను అనుగ్రహించాలని వారు మహాస్వామి వారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మర్యాదలతో మహాస్వామి వారికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసిన ఫోటోలు అందజేశారు.

## శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్న తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**విజయవాడ ఇంద్రకీలాద్రి ఫిబ్రవరి 27 (మనం న్యూస్):** ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క . ఆలయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి కి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు మరియు అర్చకులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు మంత్రి కి వేదాశీర్వచనం అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం మరియు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిడుగు రుద్రరాజు తో పాటు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. దర్శనం అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.





## జన గణన.. దేశ ప్రగతికి సరికొత్త మైలురాయి

### నిబద్ధతతో డేటా సేకరణ విధులు నిర్వర్తించాలి
### ప్రతి విషయంపైనా స్పష్టత అవసరం
### జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ

**విజయవాడ కలెక్టరేట్ ఫిబ్రవరి 27 (మనం న్యూస్)** జన గణన అనేది దేశ ప్రగతికి సరికొత్త మైలురాయి అని.. నిబద్ధత, పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తూ డేటా సేకరణ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అన్నారు. శుక్రవారం విజయవాడలోని ఆంధ్రా లయోలా కళాశాలలో సెన్సస్-2027కు సంబంధించి తొలిదశ (హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్)పై జిల్లా సెన్సస్ అధికారులు, ఛార్జ్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. మార్చి 1 వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెన్సస్ ప్రాధాన్యత, సమాచార సేకరణ విధివిధానాలు, మొబైల్ యాప్స్‌తో పాటు వివిధ డిజిటల్ వేదికలు, ప్రత్యేకంగా కేటాయించిన విధులపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అప్పుడే ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా స్వచ్ఛమైన డేటా సేకరణ

వివరాలు 6 లో..

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి: ప్రధాన కార్యదర్శి శ్యామలరావు



**మచిలీపట్నం, ఫిబ్రవరి 27(మనం న్యూస్)** వచ్చే మార్చి 1వ తేదీన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాక సందర్భంగా గన్నవరం విమానాశ్రయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి శ్యామలరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయంలోని ఉపచారిక విశ్రాంతి (సెరిమోనియల్ లాంజ్) భవనంలోని రిజర్వ్ లాంజ్, సెక్యూరిటీ చెక్ ప్రాంతాలు, నిర్గమన ప్రదేశాలను ఆమె పరిశీలించారు. అనంతరం కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడుతో కలిసి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, మార్చి 1వ తేదీన ప్రధాన న్యాయమూర్తి మధ్యాహ్నం తిరుపతి నుండి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 1.20 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని తెలిపారు. అనంతరం అమరావతి, విజయవాడల్లో పలు కార్యక్రమాలలో పాల్గొని, అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి న్యూఢిల్లీకి తిరిగి వెళతారని పేర్కొన్నారు.

ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం, వీడ్కోలు కార్యక్రమాలు ప్రోటోకాల్ ప్రకారం ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని సూచించారు. ఆయన ప్రయాణించే మార్గంలో వాహన శ్రేణి రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన యంత్ర సామాగ్రి సక్రమంగా పనిచేస్తుందో లేదో తనిఖీ చేయాలని సూచించారు. వైద్య సహాయం కోసం అంబులెన్స్‌తో పాటు సమీప ఆసుపత్రులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

ఈ పర్యటనలో విమానాశ్రయం డైరెక్టర్ ఎం.ఎల్.కే. రెడ్డి, టర్మినల్ ఇన్‌చార్జ్ అంకిత్ కుమార్, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఏసురత్నం, గుడివాడ ఆర్డీవో జి. బాలసుబ్రమణ్యం, ఆర్టీవో ఎన్.యు.ఎన్.ఎస్. శ్రీనివాసరావు, డిఎంహెచ్వో డాక్టర్ యుగంధర్, గన్నవరం డిఎస్పీ శ్రీనివాసరావు, విమానాశ్రయం సిఎస్ఓ ధర్మేంద్ర, విద్యుత్ శాఖ ఇంజనీర్ సౌజన్య, గన్నవరం తహసిల్దారు శివయ్య, ఎంపీడీవో మాధవీలత తదితర అధికారులు పాల్గొన్నారు.

# పదవికే వన్నె తెచ్చే నాయకుడు ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పోతుల బాల కోటయ్య: ఎంపీ కేశినేని శివనాథ్

## ఘనంగా ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు నూతన కార్యాలయం ప్రారంభోత్సవం

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 27 (మనం న్యూస్)** ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు నూతన కార్యాలయం విజయవాడ ఎన్టీఆర్ అడ్మిన్ భవన్ ఎరైవల్ బ్లాక్ (బస్ స్టాండ్) 4వ ఫ్లోర్ లో శుక్రవారం ప్రారంభం అయ్యింది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథి గా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హాజరయ్యారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ బాలకోటయ్య ను, డైరెక్టర్ లను ఎంపీ శివనాథ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చైర్మన్ బాలకోటయ్య కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందిస్తూ సత్కరించారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ... నిస్వార్థ పరుడైన ప్రజా సేవకుడు పోతుల బాల కోటయ్య .ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ గా పదవీ బాధ్యతలు నిర్వహించటం ఎంతో సంతోషంగా వుందన్నారు.. నిరంతరం ప్రజా సేవకుడిగా ఏ పదవీ ఆశించకుండా పనిచేసిన పోతుల బాలకోటయ్య కు సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ గా పదవి రావడం...ఆ పదవికే వన్నె చేకూరి నట్లుగా




భావిస్తున్నన్నారు.

నూతన కార్యాలయం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు దగ్గర సైతం బాలకోటయ్య చేసిన మహత్తర ప్రతిపాదన చర్చకు వచ్చిందన్నారు. బాలకోటయ్య చెప్పిన విధంగా అన్ని సంక్షేమ హాస్టల్స్ కు భారత రాజ్యాంగ నిర్మాత డా. బి ఆర్ అంబేద్కర్ నివాసం పేరు రాజగృహ పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారన్నారు. డాక్టర్. బి ఆర్ అంబేద్కర్ ఆశయాల కోసం పాటుపడే వ్యక్తులంగా పోతుల బాలకోటయ్య ఇచ్చిన సూచనలను అమలు చేసేందుకు కృషి చేస్తామని ఎంపీ శివనాథ్ తెలిపారు.

చైర్మన్ పోతుల బాలకోటయ్య మాట్లాడుతూ....ఎంపీ కేశినేని చిన్ని సహకారంతో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ గా శాఖ అభ్యున్నతికి పాటుబడతా అన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నాపై ఉంచిన నమ్మకానికి అణుగుణంగా పనిచేస్తా...అని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టల్ ల స్థితిగతులు బాగోగులపై వివరంగా నివేదిక ఇవ్వడం జరిగిందని, వసతి గృహాలకు రాజగృహ పేరు పెట్టేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ . ఉపాధ్యక్షుడు రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు గూడపాటి పద్మ శేఖర్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సొంగ సంజయ్ వర్మ, టి ఎన్ టి యు సి రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి, విజయవాడ అర్బన్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు జీవీ నరసింహారావు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై కూచిపూడి నృత్య విద్యార్థుల కళా నీరాజనం



**విజయవాడ, అందరికీలాద్రి ఫిబ్రవరి 27( మనం న్యూస్):** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం, ఇంద్రకీలాద్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ధర్మపథం' సాంస్కృతిక కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ కూచిపూడి కళాకారిణి కోట సరిత నేతృత్వంలో వారి శిష్య బృందం అమ్మవారి సన్నిధిలో అద్భుతమైన ప్రదర్శనను ఇచ్చారు.

**కార్యక్రమ విశేషాలు:**

సాయంత్రం 6 నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో విద్యార్థులు కూచిపూడి సంప్రదాయానికి అద్దం పట్టేలా మొత్తం 10 అంశాలను ప్రదర్శించారు. ప్రారంభం: 'అంభా పరాకు' మరియు 'వినాయక కౌత్వం'తో విద్యార్థులు సభను ఆధ్యాత్మి కంగా ప్రారంభించారు. భక్తి భావం: 'నమః శివాయతే', 'నర్తన గణపతిం', 'శివ స్తుతి' అంశాల్లో విద్యార్థులు చూపిన ముద్రలు, అభినయం ప్రేక్షకులను అలరించాయి. సంకీర్తనలు: రామదాసు కీర్తన, 'లలిత హరళి' మరియు 'ప్రభు శివాష్టకం' వంటి ప్రసిద్ధ కీర్తనలకు విద్యార్థులు లయబద్ధంగా నర్తించారు. ప్రత్యేక ఆకర్షణ: కూచిపూడి నృత్యంలో అత్యంత కష్టతరమైన 'తరంగం' ప్రదర్శన ను విద్యార్థులు ఎంతో చాకచక్యం గా ప్రదర్శించి భక్తుల మెప్పు పొందారు. చివరగా 'జయ జయ దుర్గే' నృత్యంతో కార్యక్రమం మంగళప్రదంగా ముగిసింది.

నృత్య విద్యార్థులు కనబరిచిన ప్రతిభను, వారి క్రమశిక్షణను భక్తులు మనసారా అభినందించారు. భారతీయ సనాతన ధర్మాన్ని, శాస్త్రీయ కళలను భావితరాలకు అందించే లక్ష్యంతో సాగుతున్న ఈ తరహా కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోంది.

# మచిలీపట్నంలో మరో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి కలెక్టర్ ఆదేశాలు



**మచిలీపట్నం, ఫిబ్రవరి 27(మనం న్యూస్) :** మచిలీపట్నం నగరంలో క్రీడల అభివృద్ధికి మరింత ఊతమిచ్చే దిశగా మరో బహుళ ప్రయోజనాల ఇండోర్ స్టేడియం మరియు స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయంలోని సమావేశ మందిరంలో క్రీడల అభివృద్ధిపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం నగరంలోని గోసంఘం టిడ్కో గృహాల సమీపంలో ఈ నిర్మాణాలకు స్థలం కేటాయించినట్లు తెలిపారు. రూ. 17 కోట్ల వ్యయంతో బహుళ ప్రయోజనాల ఇండోర్ స్టేడియం, రూ. 9.30 కోట్ల వ్యయంతో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టుల అమలుకు అవసరమైన తాజా ప్రతిపాదనలతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేసి యువతలో క్రీడా ఆసక్తిని పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర శాప్ ఏడి వేణు, క్రీడల అధికారి సురేంద్రబాబు, కన్సల్టెంట్ మోహన్, ఆర్ అండ్ బి డీఈఈ సంగీత, ఏపీఎంఐడీసీ డీఈ ప్రవీణ్, టెక్నికల్ అసిస్టెంట్ చల్లా రాము తదితర అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి బోధన

## పదో తరగతి విద్యార్థులకు డీవీఆర్ ప్రేరణ తరగతులు

**మచిలీపట్నం, ఫిబ్రవరి 27 (మనం న్యూస్) :** మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పదవ తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ తెలిపారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కాలేఖాన్‌పేట మున్సిపల్ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ సలహాదారుడు దిట్టకవి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డీవీఆర్ ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా దిట్టకవి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలను భయపడకుండా ఆత్మవిశ్వాసంతో రాయాలని సూచించారు. ముందుగా బాగా తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలని, పరీక్షల సమయంలో సమయానికి నిద్రపోవాలని, సాత్విక ఆహారం తీసుకోవాలని సూచించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ హసీం బేగ్ మాట్లాడుతూ కాలేఖాన్‌పేటలో 560 మార్కులు సాధించే ఒక మైనారిటీ విద్యార్థినికి ఇంటర్ చదువుకు కావాల్సిన ఫీజును తానే భరిస్తానని ప్రకటించారు. జిల్లా కో-కన్వీనర్ ముదిగొండ శాస్త్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 మానవతా శాఖల ద్వారా సుమారు 60 వేల మంది పదవ తరగతి విద్యార్థులకు 'విజయీభవ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు, మాజీ కౌన్సిలర్ బొడ్డు శ్రీను, యోగా మాస్టర్ బత్తిన నాగసుభాషిణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిట్టకవి వెంకటేశ్వరరావు నాగసుభాషిణిని ఘనంగా సత్కరించారు.



# నూతన ఆవిష్కరణలతో కుటుంబ వ్యాపారాల వృద్ధి

**గాంధీనగర్ ఫిబ్రవరి 27 మనం న్యూస్:** కుటుంబ యాజమాన్యంలోని వ్యాపా రాలు భారతదేశ స్థూల జాతీయోత్పత్తిలో మూడు వంతుల కన్నా ఎక్కువ వాటాను అందిస్తుండగా, 2047నాటికి దేశాభివృద్ధి లో మరింత పెద్ద పాత్ర పోషిస్తాయని అంచనా. అయితే, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ విడుదల చేసిన నూతన అధ్యయన నివేదిక ప్రకారం, పలు మధ్య తరహా కుటుంబ సంస్థలు స్వల్పకాలిక లాభాలపై అంటే, ఈబీఐటీడీఏపై మాత్రమే దృష్టి సారించడంతో భారతదేశం పెరుగుతున్న ఆర్థిక వృద్ధిని ఇంకా పూర్తిగా అందిపుచ్చుకోలేకపోతున్నాయి. బిజినెస్ ఇన్నోవేషన్- యాన్ ఇంపరేటివ్ ఫర్ ఇండియన్ ఫ్యామిలీ-లెడ్ బిజినెసెస్ పేరిట ఐఎస్‌బి విడుదల చేసిన కొత్త నివేదిక, కుటుంబాలు నిర్వహించే సంస్థలు స్థానిక, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలకు వెన్నెముకగా కొనసాగుతున్నప్పటికీ, చాలా వరకు పెరుగుతున్న వృద్ధి నమూనాలపై ఆధారపడుతూ, అధిక వృద్ధి రంగాలలోని అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకోవడం లేదు. బలమైన కార్యాచరణ పునాదులపై నిర్మించబడినప్పటికీ మార్కెట్‌లను సృష్టించడం, కనిపించని ఆస్తులలో పెట్టుబడి పెట్టడం, వారి ప్రధాన వ్యాపారానికి అనుగుణంగా భవిష్యత్తు ఆదాయ నమూనాలను రూపొందించడం అనే దృష్టి, ఆశయం లేని మధ్య తరహా సంస్థలలో ఈ అంతరం ఎక్కువగా కనిపిస్తుంది.

## సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ (మెన్) టోర్నమెంట్ కి యల్.బి.ఆర్.సి.ఈ విద్యార్థి ఎంపిక



**మైలవరం ఫిబ్రవరి 27 మనం న్యూస్:** స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ కొరిని సందీప్, సి.ఎస్.ఈ విద్యార్థి, వచ్చేనెల 2వ తేదీ నుండి – 6వ తేదీ వరకు భారతిదాసన్ యూనివర్సిటీ లో జరుగబోయే సౌత్ జోన్ ఇంటర్ యూని వర్సిటీ చెస్ (మెన్) టోర్నమెంట్ లో పాల్గొనటానికి జె.యన్.టి. యునివర్సిటీ, కాకినాడ తరపున ఎంపిక ఐనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.అప్పా రావు తెలియచేసారు. ఈ సందర్భంగా విద్యార్థిని, ఫిసికల్ ఎడ్యుకేషన్ విభాగాదిపతి రాజ్ కుమార్ ని కళాశాల ప్రిన్సిపాల్ కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.రమేష్ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

## నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ లో యల్.బి.ఆర్.సి.ఈ ఎన్.ఎస్.ఎస్ విద్యార్థుల ప్రతిభ



**మైలవరం ఫిబ్రవరి 27 మనం న్యూస్:** బీహార్ రాష్ట్రం, భాగల్పూర్ లోని మార్వారి కళాశాలలో, తిల్కా మాంఝీ భాగల్పూర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ వారం రోజుల పాటు విజయవంతం గా నిర్వహించబడింది. ఈ క్యాంప్‌లో దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల నుండి విద్యార్థులు పాల్గొని జాతీయ ఐక్యత, సాంస్కృతిక వైవిధ్యంపై అవగాహన పొందారు. ఈ క్యాంప్‌కు మన ఎన్టీఆర్ జిల్లా లోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ నుంచి ఆంధ్రప్రదేశ్ కాంటింజెంట్ లీడర్‌గా బి.ఎస్.హరి ప్రసాద్ హాజరు కాగా, విద్యార్థులు పీ. సౌజన్య, పి.లలిత, వి. రవెంత్ మరియు సి. హెచ్. చరణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అతిథి ఉపన్యాసాలు, అవగాహన సెషన్లు మరియు వివిధ కార్యక్రమాలు నిర్వహించ బడ్డాయి. వారు నిర్వహించిన రంగోలి పోటీలో ఆంధ్రప్రదేశ్ టీమ్ మొదటి బహుమతి సాధించి ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. అలాగే కల్చరల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో పంజాబ్ టీమ్‌తో సంస్కృతుల పరస్పర మార్పిడి పోటీలతో జాతీయ సమైక్యతను నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని , విద్యార్థులను, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.శివ హరి ప్రసాద్ ని కళాశాల ప్రిన్సిపాల్ కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

## గుండెపోటుతో టీడీపీ సీనియర్ నేత మృతి

### ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు



**కొండపల్లి, ఫిబ్రవరి 27.(మనం న్యూస్)** కొండపల్లి మున్సిపాలిటీకి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఎండ్లూరి సుబ్బానాయుడు గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు శుక్రవారం కొండపల్లికి విచ్చేసి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన భౌతికకాయంపై టీడీపీ జెండాను కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండపల్లి గ్రామ శాఖ పార్టీ మాజీ అధ్యక్షునిగా తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడంలో సుబ్బానాయుడు ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. ఆయన మధ్య భౌతికంగా లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఆయన పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై విస్తృత చైతన్య సదస్సులు

### ఎన్టీఆర్ జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు



**గన్నవరం ఫిబ్రవరి 27 (మనం న్యూస్)**జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) ఆధ్వర్యంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి మార్గనిర్దేశనంతో ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై విస్తృతంగా అవగాహన సదస్సులు జరుగుతున్నాయని ఎన్‌టీఆర్ జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు తెలిపారు. శుక్రవారం సూరంపల్లిలోని సీఐపీఈటీలో జరిగిన అవగాహన కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి మధు మాట్లాడుతూ శుక్రవారం తిరువూరు, ఎ.కొండూరులో కూడా వర్క్‌షాప్‌లు నిర్వహించినట్లు వివరించారు. గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త నినాదాన్ని సాకారం చేసే దిశగా సమష్టి కృషి అవసరమన్నారు. ఎంఎస్‌ఎంఈల స్థాపన, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సొంతగా యూనిట్లు స్థాపించి పది మందికి ఉపాధి కల్పించగల స్థాయికి యువత ఎదగాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ పరిశ్రమలు స్థాపించాలని పరిశ్రమల అధికారి ఎం.మధు విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఏడీ ఎస్.బాలసుబ్రహ్మణ్యం, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్లు పి.మనీషా, ఆర్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీ డిమాండ్ల సాధనకై మార్చి 16 న పార్లమెంట్ ముట్టడి

**విజయవాడ,(సెంట్రల్) ఫిబ్రవరి 27 మనం న్యూస్** కులగణన చేపట్టాలనీ కేంద్ర మంత్రి మండలి మంత్రి మండలి నిర్ణయం అమలు చేయాలని ,కేంద్రంలో ఓ బీసీ లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 16 వ తేదీన పార్లమెంట్ ముట్టడిస్తామని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ పేరుకొన్నారు. శుక్రవారం ఏలూరు రోడ్ లోని ఓబీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో వరప్రసాద్ యాదవ్ మాట్లాడారు. దేశంలో 52% పైగా జనాభా కలిగి ఉన్న ఓబీసీ లకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ ను డిమాండ్ చేశారు. చట్టసభలలో ఓబీసీ రిజర్వేషన్లు బిల్లు మార్చి లో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టాలనీ వరప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు గత 5 దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఓబీసీ లను సామాజికంగా, రాజకీయంగా అణచి వేయడం జరిగిందని ఆయన అన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా ఓబీసీ

**ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వరప్రసాద్ యాదవ్ :సమగ్ర జనగణనలో ఓబీసీ**

జనగణన, చట్ట సభల లో రిజర్వేషన్లు అమలు,ఓబీసీ మంత్రిత్వ శాఖ పై గళమెత్తే కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పార్లమెంట్ లో ఎందుకు ఓబీసీ అంశాల పై నోరు విప్పడం లేదని వరప్రసాద్ యాదవ్ ప్రశ్నించారు . ఓబీసీ ల పట్ల రాహుల్ గాంధీ తీరుకు నిరసనగా మార్చి 17 న ఏఐసీసీ కార్యాలయం ముట్టడిస్తామని వరప్రసాద్ యాదవ్ హెచ్చరించారు. మార్చి 18 న ఓబీసీ ల జాతీయ సదస్సు ఢిల్లీ



కాన్స్టిట్యూషన్ క్లబ్ లో జరుగుతుందని వరప్రసాద్ తెలిపారు. ఈ సదస్సు లో వివిధ పార్టీల జాతీయ నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాటపర్తి పోసిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్న సుబ్బారావు, ఓబీసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ రమాదేవి, రాష్ట్ర కార్యదర్శి యు. పేరయ్య, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్ శివం. శివన్నారాయణ , పాల్గొన్నారు . విజయవాడ నగర ఓబీసీ మహిళ సంఘం అధ్యక్షురాలు మల్లెడ రూప, నందిగామ నియోజక వర్గ కన్వీనర్ గా కె.నవీన్, ఎన్టీఆర్ జిల్లా కో – ఆర్డినేటర్ గా ఎం. మల్లిఖార్జున రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గా ఎం.శివన్నారాయణ చందర్లపాడు, నందిగామ, వీరులపాడు, కంచికచర్ల మండల ఓబీసీ సంఘం అధ్యక్షులుగా గోపీకృష్ణ, పి. నాగరాజు, వై శ్రీనివాస్, బి.రామకృష్ణ లను నియమిస్తూ జాతీయ అధ్యక్షులు వరప్రసాద్ యాదవ్ నియామక పత్రాలు అందజేశారు.

## ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి




**విజయవాడ సెంట్రల్ ఫిబ్రవరి 27 ( మనం న్యూస్) :** పెండింగ్ లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ( పీ డీ ఎస్ యూ )ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలోని అలంకార్ సెంటర్ వద్దనున్న ధర్నా చౌక్ లో ధర్నా కనిర్వహించారు. ఈ సందర్భంగా పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.భాస్కర్, ఎం.వినోద్ కుమార్ మాట్లాడుతూ యువగలం పాదయాత్రలో మేము అధికారంలోకి వచ్చిన వెంటనే 100 రోజుల్లో పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేస్తామని, పేద బడుగు బలహీనవర్గాల పీజి విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77ను రద్దుచేసి ప్రతి విద్యార్థికి ఫీజు రియంబర్స్మెంట్ వర్తింప చేస్తామని నారా లోకేష్ సొంత నియోజకవర్గంలో మంగళగిరిలో హామీ ఇచ్చారు. కానీ నేడు అధికారంలోకి వచ్చి 20 నెలలకు పైగా పూర్తవుతున్న ఇటీవల అసెంబ్లీ సమావేశాలకు ముందు దాహంతో ఉన్నవాడికి తడి చేసినట్లు 2024 – 25 విద్యా సంవత్సరానికి సంబంధించిన 1198 కోట్ల రూపాయలు రియంబర్స్మెంట్ బకాయిలు మాత్రమే విడుదల చేసి ఇంకా పెండింగ్ లో ఉన్న 6,200 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి కానీ బడ్జెట్ సమావేశంలో రియంబర్స్మెంట్ పై ఊసే లేదని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్. రాజశేఖర్, యం.సునీల్, అంకన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐ.రాజేష్, కె.నాని, వీరేంద్ర ప్రసాద్, రాంబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణ ,అఖండ, శంకర్, ప్రసాద్ ,షారుక్ ,ఆశిర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమలో సుజనా ఫౌండేషన్ మొబైల్ మెడికల్ క్యాంపులు. నేడు రేపు




**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 27 (మనం న్యూస్):** ఈనెల 28, మార్చి 1 తేదీల్లో పశ్చిమ నియోజకవర్గ పరిధిలో సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ మెడికల్ వ్యాన్ల ద్వారా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.. ఈనెల 28 వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలో 48, 49 డివిజన్లలోని ప్రైజర్ పేట, టైలర్ పేట, జోడు బొమ్మల సెంటర్, తదితర ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత మొబైల్ మెడికల్ క్యాంప్ ద్వారా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలు, చికిత్స పొందవచ్చని తెలిపారు.. ఈ క్యాంపులో వివిధ విభా గాల సీనియర్ వైద్యుల కన్సల్టేషన్ తో పాటు ఈసీజీ, ఎక్స్‌రే, 2డీ ఎకో , కంటి పరీక్షలు, దంత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు . పరీక్షల అనంతరం ఆయా వ్యాధులకు సం బంధించిన మందులు కూడా ఉచితంగా అంద చేస్తారని తెలిపారు. అదే విధంగా మార్చి 1వ తేదీ ఆదివారం కేబీఎన్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మొబైల్ వైద్య శిబిరం నిర్వహి స్తున్నట్లు తెలిపారు.. 38 , 51, 52 డివిజన్ల పరిధిలోని మల్లిఖార్జునపేట, హెడ్ వాటర్ వర్క్స్, కుమ్మరిపాలెం, గుప్తా సెంటర్, అర్జున్ వీధి, ఆంజనేయ వాగు సెంటర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# మనగ్రోమోర్ ఉద్యోగులను విచారించిన ఏడీఏ సునీల్

**రైతులను ఇబ్బంది పెడితే చర్యలు**

**ఉయ్యూరు ఫిబ్రవరి 27 ( మనం న్యూస్) :** ఎరువుల విక్రయం సందర్భంగా రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ గన్నవరం అసిస్టెంట్ డైరెక్టర్ సునీల్ అన్నారు. పశువులదాణా తీసు కుంటేనే యూరియా ఇస్తామని యూరియాకు కొనుగోలుతో పశువులదాణా ముడిపెట్టి దాణా తీసుకోని రైతులకు యూరియా విక్రయించేందుకు నిరాకరించిన మనగ్రోమోర్ సంస్థ



నిర్వాకాన్ని యూరియా కోసం రైతుల ఆందోళన శీర్షికన శుక్రవారం నాడు మండల వ్యవసాయాధికారి నుండి వచ్చిన ఫిర్యాదులతో స్పందించిన వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గండిగుంటకు చెందిన రైతులనుండి ఫిర్యాదు స్వీకరించారు. ఈసందర్భంగా మనగ్రోమోర్ సంస్థ ఉద్యోగులను పిలిపించి విచారించారు. సంస్థ ఉద్యోగుల వివరణకు సంతృప్తి చెందని ఆయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేసి రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులు, పురుగు మందులు అమ్మేందుకు లైసెన్స్ ఇస్తే పశువుల దాణా ఎట్లా అమ్ముతారని ప్రశ్నించారు. గోదాము తనిఖీచేసి తనకు రిపోర్టు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి నిస్సీగ్రేస్ను ఆదేశించారు.

# శ్రీ సీతారామచంద్రస్వామి వారి కృపాకటాక్షాలతో అందరికీ మంచి జరగాలి


**మాజీ ఎమ్మెల్సీ వైవిబి. రాజేంద్రప్రసాద్.**

**ఉయ్యూరు ఫిబ్రవరి 27 (మనం న్యూస్) :** తాడంకి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి వారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆలయ ఆహ్వానం కమిటీ మేరకు విచ్చేసి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం, మాజీ ఎంపీ కొనకల్లా నారాయణరావు గారు, జిల్లా పార్టీ అధ్యక్షులు వీరంకి గురుమూర్తి గార్లతో పాటుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన రాజేంద్రప్రసాద్ ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ గారు మాట్లాడుతూ తాడంకి గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయం నిర్మించి , విగ్రహా పున ప్రతిష్ట చేయడం శుభ పరిణామమని, ఈ కార్యక్రమం శ్రీ పీఠం



వ్యవస్థాపకులు శ్రీ పరిపూర్ణానంద స్వామి వారి చేతుల మీదుగా జరగడం ఆనందదాయకమని, శ్రీరామచంద్ర ప్రభు చూపించిన మంచి మార్గంలో నడుస్తూ రాబోయే తరాల వారు కూడా సనాతన ధర్మం పట్ల భక్తి శ్రద్ధలతో ఉండేటట్లు చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆలయ కమిటీ వారు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# జనసేనపార్టీ ఉద్యమి సభ్యత్వనమోదు కార్యక్రమాన్నిప్రారంభించిన ప్రభుత్వవిప్ బొమ్మిడి నాయకర్ మరియుసామినేని



**మైలవరం ఫిబ్రవరి 27 మనం న్యూస్:** జనసేనపార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన నరసాపురం నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మరియు జనసేనపార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను. స్థానిక మైలవరం పంచాయతీ ఆఫీస్ సెంటర్ నందు మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ అక్కల రామ్మోహన్ రావు(గాంధీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ గతంలో జిల్లా వ్యాప్తంగా 50 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేశారని! ఈ సంవత్సరం రెండు రెట్లు అధికంగా క్రియాశీలక ఉద్యమి సభ్యత్వాలు నమోదు చేయాలని జనసేన నాయకులను కోరారు. ఉదయభాను మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసేలా సాదక్ లు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఏఎంసీ చైర్మన్ పొనకళ్ళ నవ్యశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు బొలియాశెట్టి శ్రీకాంత్, జిల్లా సెక్రెటరీ చింతల లక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య, చాపలమడుగు కాంతారావు, ఎర్రబోలు నరసింహారావు మరియు జనసేన నాయకులు చెరుకుమల్లి సురేష్, ఎర్రంశెట్టి నాని, గజరావు శ్రీనివాసరావు, జీ.వీ రవితేజ, ఆకుతోట ఈశ్వర్, పడిగల ఉదయ్, పాములపాటి సుందర్ రామిరెడ్డి, వైఎన్ఆర్, కటకం ధర్మారావు, మెరుగు నాగేశ్వరరావు(నాని), క్రాంతి, పౌల్ రాజ్, చంద్రాల మురళీకృష్ణ, ప్రత్తి తిరుపతిరావు, బడే హాజరత్, కొండ, సాంబశివరావు, సురేష్, తోమ్మండ్రు నవీన్, కళ్యాణ్, ఆనం విజయ్, మారెళ్ళ భాస్కర్, రాగాల నాని జన సైనికులు మరియు వీరమహిళలు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ నాయకులను సన్మానించిన లంక లితీష్

**మైలవరం ఫిబ్రవరి 27 మనం న్యూస్:** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ ప్రారంభోత్సవ ( ఉద్యమి రిజిస్ట్రేషన్ ) కార్యక్రమానికి మైలవరం పంచాయతీ సర్కిల్ వద్ద నిర్వహించిన సభకు విచ్చేసిన జనసేన పార్టీ నరసాపురం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బొమ్మిడి నారాయణ నాయకర్, ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ అక్కల రామ్మోహన్ రావు (గాంధీ ) లను తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ సన్మానించినారు.



## పశ్చిమ నియోజకవర్గ డ్వాక్రా మహిళల సమస్యలకు పరిష్కార మార్గాలపై అవగాహన..



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 27 (మనం న్యూస్):** ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణం పై చిత్తశుద్ధితో ఉందని ఎన్టీఆర్ జిల్లా హౌసింగ్ డిపార్ట్మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రజనీకుమారి అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజవర్గంలోని 52 వ డివిజన్ కు సంబందించిన డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయం ఆధ్వర్యంలో వివిధ అంశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. చిట్టినగర్ జోడు బొమ్మల సెంటర్ లోని హైమావతి కళ్యాణమంటపం లో జరిగిన కార్యక్రమంలో పీడీ రజనీకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇళ్ల నిర్మాణం చేపడుతుందని ఆమె అన్నారు. ఇప్పటికే అర్హులను గుర్తించి వారికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఇళ్లు కేటాయిస్తామని ఆమె తెలిపారు. ఇప్పటికే ఇళ్లు కేటాయించిన లబ్దిదారులకు సంబందించిన సందేహాలను ఆమె నివృత్తి చేశారు. అదేవిధంగా అను మై బేబీ హాస్పిటల్ వారు మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా ఆరోగ్య సమస్యలపై డాక్టర్ మౌనిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయ వెల్ఫేర్ ఆఫీసర్ రిజ్వానా సుల్తానా డ్వాక్రా మహిళలకు సంబందించి ప్రభుత్వం ద్వారా వెసులుబాటు ఉన్న వివిధ సంక్షేమ పథకాలకు సంబందించి వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, సుజనా మిత్రలు, పాల్గొన్నారు. ..

## చీఫ్ జస్టీస్ పర్యటన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు



**విజయవాడ తూర్పు ఫిబ్రవరి 27 (మనం న్యూస్):** మార్చి నెల ఒకటో తారీఖున సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యాకాంత్ విజయవాడ పర్యటన సందర్భంగా లోక్ భవన్, హోటల్ నోవోటల్ మరియు పటమట డొంక రోడ్డులోని ఆంట్రా లక్స్ ఫంక్షన్ హాల్ నందు చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు పరిశీలించారు ఈ కార్యక్రమంలో డి.సి.పి. కృష్ణ కాంత్ పటేల్, జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా డి.సి.పి.ఎస్.వి.డి.ప్రసాద్ , ఏ.డి.సి.పి. ఎం.బి.ఎం. మురళీ కృష్ణ ఏ.ఆర్.ఏ.డి.సి.పి. కోటేశ్వర రావు , సెంట్రల్ ఏ.సి.పి. దామోదర్ , ఇతర శాఖల అధికారులు, ఇన్స్పెక్టర్లు మరియు ఆయా ప్రదేశాల నిర్వాహకులు పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ స్వీయ పర్యవేక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి లోక్ భవన్, హోటల్ నోవోటల్ మరియు పటమట డొంక రోడ్డులోని ఆంట్రా లక్స్ ఫంక్షన్ హాల్ మరియు పరిసర ప్రాంతాలలో అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ అత్యంత పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ లోక్ భవన్, హోటల్ నోవోటల్ మరియు పటమట డొంక రోడ్డులోని ఆంట్రా లక్స్ ఫంక్షన్ హాల్ లలోని బందోబస్తు ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాలు మరియు పరిసర ప్రాంతాలను పరిశీలించి సంబంధిత అధికారులకు మరియు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

## ఏపీటీఎఫ్ ధర్నా



**ఉయ్యూరు ఫిబ్రవరి 27 (మనం న్యూస్) :** సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఉయ్యూరు జోనల్ కన్వీనర్ డీఎన్ సాంబశివరావు అన్నారు. రాష్ట్రం లో అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో భాగంగా శుక్రవారం తహసీల్దా ర్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు ధర్నాచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టెట్నుండి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను మినహాయించాలని, సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని ఉద్యమం చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులకు యాపుల భారాన్ని, ఆన్లైన్ పనిభారాన్ని తగ్గించి బోధన కార్యక్రమాలకే పరి మితం చేయడంతో పాలు ఇతర డిమాండ్లు అమోదించి, సమస్యలు పరిష్కరించాల న్నారు. జోనల్ కో-కన్వీనర్ పి శివాజీగణేశ్, నాయకులు కె సీతారామయ్య, మురళీ కృష్ణ, పి సత్యనారాయణ తదితరులు పాల్గొని తహసీల్దార్కు వినతిపత్రం అందచేశారు.

## ఖతమ్-యే-ఖురాన్' ఇఫ్తార్ వేడుక

### ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 27 (మనం న్యూస్):** భవానిపురంలోని వెలంపల్లి కాలనీలో శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో 'ఖతమ్-యే-ఖురాన్' మరియు ఇఫ్తార్ విందు నిర్వహించారు. షేక్ ఉమర్ ఫారూక్ సిద్ధిఖీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే తరావీహ్ ప్రార్థనల ద్వారా ఖురాన్ పఠనం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక వేడుకలో మాజీ మంత్రి పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్ధనలు చేసి ఇఫ్తార్ విందును స్వీకరించి, వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, "రంజాన్ మాసం పవిత్రతకు, క్రమశిక్షణకు మరియు సోదరభావానికి ప్రతీక. ఇలాంటి వేడుకలు సమాజంలో శాంతియుత వాతావరణాన్ని, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తాయి" అని పేర్కొన్నారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ, ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, షేక్ ఉమర్ ఫారూక్ సిద్ధిఖీ, కాలనీవాసులు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు

## డిజిటల్ అరెస్ట్ పట్ల తెలివిగా వ్యవహరించిన వృద్ధదంపతులకు సత్కారం

### డిజిటల్ అరెస్ట్ అనే పదమే న్యాయవ్యవస్థలో లేదు – జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

**ఉయ్యూరు ఫిబ్రవరి 27 (మనం న్యూస్):** డిజిటల్ అరెస్ట్ సంఘటన ధైర్యంగా ఎదుర్కొని తెలివిగా వ్యవహరించడం అభినందనీ యమని జిల్లా ఎస్పీ విద్యాసాగర్నాయుడు అన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి తెలివిగా వ్యవహరించి సైబర్ నేరగాళ్ల నుంచి తప్పించుకున్న వృద్ధులు కోటా శివశంకర్ దంపతులను స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో శుక్రవారం సత్కరించారు. ఏజీఅండ్ఎస్ ఎస్ కళాశాల రోడ్డులో నివసించే కోటా శివశంకర్ దంపతులకు ఇటీ వల ముంబై క్రైమ్ బ్రాంచ్ నుంచి మాట్లాడుతున్నామని ఫోన్చేసి మీఆధార్ కార్డు ద్వారా రూ. 25 లక్షల మనీలాం డరింగ్ జరిగింది దానికి సంబంధించి మీపై సుప్రీం కోర్టు నుండి అరెస్ట్ వారెంట్ జారీ అయ్యిందని చెప్పి సుప్రీంకోర్టు జడ్జిగా ఒకరిని వీడి యోకాల్ మాట్లాడించారు. బ్యాంక్ ఖాతా వివరాలు, స్థిర చరాస్తుల వివరాలు అన్నీ ఇవ్వాలని ఈవిషయాలను ఎవరికీ చెప్పకూడదని చెబితే వెంటనే లోకల్ పోలీస్ లు వ చ్చి అరెస??చసి ముంబై పంపిస్తారని భయపెట్టారు. సైబర్ నేరాల పట్ల అవగాహన ఉ న్న శివశంకర్ దంపతులు స్థానిక సీఐ రామారావుకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్నసీఐ కొద్దిసేపు గమనించి ముంబైక్రైమ్ బ్రాంచ్ ఎస్పీగా చెపుతున్న నకిలీ వ్యక్తి ఫోన్ స్క్రీన్ మీదకు రాగా మాట్లాడేందుకు ప్రయత్నించడంతో అతను లైన్కట్ చేసి తప్పుకున్నాడు. డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరం తెలివిగా ఎదుర్కొన్న శివశంకర్ దంపతులు, సీఐ రామారావును ఎస్పీ, డీఎస్పీ శ్రీనివాస్ అభినందించారు.



## అమేజాన్ బజార్ లో రూ. 299 కంటే తక్కువ ధరలకే హోలీ ఉత్పత్తులతో రంగుల పండుగ చేయండి

**గాంధీనగర్ ఫిబ్రవరి 27 మనం న్యూస్ :** అతి తక్కువ ధరలకు ప్రతి భారతీయుడు హోలీ పండగను సులభంగా సంబరం చేయడానికి అమేజాన్ బజార్ నాణ్యత మరియు సరసమైన ధరలు రెండిటినీ తెచ్చింది. అత్యంత తక్కువ ధరలకే కస్టమర్లు హోలీ పండగకు అవసరమైనవి పండగ సమయంలో తప్పనిసరిగా ఉండవలసిన వస్తువులను విస్తృత శ్రేణి నుండి కొనుగోలు చేయవచ్చు. రూ. 299 కంటే తక్కువ ధరలకే కస్టమర్లు హోలీ వస్తువులను పొందండి, అదనంగా క్యాష్ బాక్ ను ఆనందించవచ్చు, అన్ని ఆర్డర్స్ పై ఉచిత డెలివరీ మెగా డిస్కొంట్లు పొందవచ్చు. సరసమైన పండగ షాపింగ్ కోసం భారతదేశపు నమ్మకమైన గమ్యస్థానం అమేజాన్ బజార్ తో రంగుల పండగను ఆనందించండి.

# విజయవాడ గ్రేటర్ అయ్యేలోపు నగరాన్ని ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి చేస్తాము

**విజయవాడ తూర్పు ఫిబ్రవరి 27 ( మనం న్యూస్ ) :** 9వ డివిజన్ లో పర్యటించిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్నేషనల్ హైవే, కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలనబెంజ్ సర్కిల్ పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పూర్తిస్థాయిలో చర్యలు. పటమట లంక నుంచి ఎమ్. జి రోడ్డుకి ఫ్లై ఓవర్ కింద రోడ్డు ఏర్పాటు . మార్చి 15వ తేదీన ఎ. కొండూరు మండలంలో వాటర్ ట్యాంకులు ప్రారంభోత్సవంకమ్యూనిస్టు నాయకులు నిర్మాణాత్మక విమర్శలు చేయాలని ఎంపీ సూచన.



విజయవాడ గ్రేటర్ కాక ముందే తాగునీటి , స్ట్రాంమ్ వాటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలతో పాటు నగరాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, సుజనా చౌదరిలతో కలిసి కృషి చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 9వ డివిజన్ లోని ప్రధాన రద్దీ ప్రాంతమైన బెంజ్ సర్కిల్, లారీ ఓనర్స్ హాల్, జ్యోతి కన్వెన్షన్ హాల్ పరిసరాల్లో వాహనాలు, స్థానికులు రాకపోకలు సాగించడానికి అనువుగా ఉండేలా చర్యలు తీసుకునేందకు శుక్రవారం నేషనల్ హైవే పిడి తో కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ లతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎంపీకేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగులు పడుతున్నాయని వెల్లడించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, చెన్నుపాటి గాంధీ తదితరులు జాతీయ రహదారి ప్రాజెక్ట్ డైరెక్టర్, కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్‌లతో కలిసి ప్రాంతాన్ని పరిశీలించటం జరిగిందన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించిన లారీ ఓనర్స్ అసోసియేషన్ కళ్యాణ మండపం పార్కింగ్ స్థలం సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పటమటలంక వాసులు స్క్రూ-బ్రిడ్జ్ కింద నుంచి ఇటువైపునకు రావడానికి వీలుగా రోడ్డు మార్గం కావాలని నేషనల్ హైవే అధికారులను కోరగా అందుకు సమ్మతించినట్లు తెలిపారు. హైవే వెంట గ్రీనరీ అభివృద్ధికి ముందుకొచ్చినందుకు లారీ ఓనర్స్ అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, మున్సిపల్ మరియు నేషనల్ హైవే శాఖలతో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తుది నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. రెండు నెలల్లో ప్రస్తుత సమస్యల పరిష్కారానికి చర్యలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కొత్త బస్ స్టాండ్ నుంచి స్క్రూ బ్రిడ్జి వరకు, అలాగే కనకదుర్గమ్మ వారధి వద్ద జనాలు దిగేందుకు, ఎక్కేందుకు వీలుగా ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదన సమర్పించామని వెల్లడించారు. దీనికి సంబంధించి 'ఇన్ ప్రిన్సిపల్'గా మినిట్స్ నమోదు చేసి అధికారులకు పంపినట్లు తెలిపారు. అంతకుముందు గద్దె రామారావుతో కలిసి ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం లభిస్తే ఫ్లైఓవర్ నిర్మాణం వేగవంతమవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో కృష్ణలంక ప్రాంతానికి చెందిన లక్షన్నర మందికి పైగా ప్రజలకు ఎంతో ప్రయోజనంగా వుంటుందని పేర్కొన్నారు. వెస్ట్రన్ బైపాస్ పూర్తి కావడం, బెంజ్ సర్కిల్ నుంచి గంగూరు వరకు, అలాగే బెంజ్ సర్కిల్ నుంచి కొత్త బస్ స్టాండ్ వరకు ప్రతిపాదిత ఫ్లైఓవర్లు పూర్తి అయితే నగర ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు

**కమ్యూనిస్టులు నిర్మాణత్మక విమర్శులు చేయాలి**

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తాను కృష్ణలంకలో అండర్‌పాస్‌ల నిర్మాణంపై పదేపదే విజ్ఞప్తి చేయడంతో జాతీయ రహదారి అధికారులు రాణిగారి తోట వద్ద సబ్‌వేను మంజూరు చేశారని తెలిపారు. ప్రమాదాలకు కేంద్రంగా మారిన ఆ ప్రాంతంలో భద్రతా సమస్యలు సబ్‌వే నిర్మాణంతో తొలగిపోతాయని చెప్పారు. శుక్రవారం టెండర్లు తెరవనున్నట్లు వెల్లడించారు. ఈ దశలో ఇప్పుడే నిద్ర లేచినట్లు సిపిఐ, సిపిఎం ఎందుకు ధర్నాలు చేస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. గత ఐదేళ్లలో నగర అభివృద్ధిపై స్పందించని సీపీఐ, సీపీఎం నాయకులు ప్రస్తుతం విమర్శలు చేయడం విచారకరమని అన్నారు. నిర్మాణాత్మక విమర్శలు స్వాగతి స్తామని, అభివృద్ధి కార్యక్రమాలను రాజకీ యాలకు అతీతంగా చూడాలని సూచిం చారు.

**మరో 10 రోజుల్లో నగరానికి పట్టిన చీడ పోతుంది**

నగరాభివృద్ధికి రూ. 3 వేల కోట్ల తో డి. పి. ఆర్. తయారు చేయటానికి ఒప్పుకోని మున్సిపల్ కౌన్సిల్ నగరానికి పట్టిన చీడ అంటూ మండిపడ్డారు. మరో పది రోజుల్లో ఆ చీడ పోతుందని.. ఆర్. యు. బి, ఆర్. వో. బి, సబ్ వే లు, డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్ లకు సంబంధించిన డిపిఆర్ లు రెడీ అవుతున్నాయన్నారు.

**మార్చి 15వ తేదీ ప్రారంభోత్సవం**

అలాగే జి. కొండూరు పరిసర ప్రాంతాల్లో 18 గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం చేపట్టిన వాటర్ ట్యాంకులు మార్చి 15 ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కిడ్నీ బాధితుల కోసం ట్యాంకర్లతో మంచి నీరు అందిస్తున్నట్లు తెలిపారు. నిలిచిపోయిన కాంట్రాక్టులను పునఃప్రారంభించి పనులు వేగవంతం చేశామని వెల్లడించారు. ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణా నది నుంచి నీటిని సరఫరా చేసే ప్రాజెక్ట్‌కు చివరి దశ పనులు జరుగుతున్నాయని తెలిపారు. మార్చి 15కల్లా అన్ని గ్రామాల్లో, అన్ని హ్యాబిటేషన్స్ లోనూ ఎక్కడైతే షెడ్యూల్ ట్రైబ్స్ ఉన్నారో ఇబ్రహీంపట్నం నుంచి కృష్ణనది నీళ్లు అందించనున్నట్లు తెలిపారు.

**ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ** బెంజ్ సర్కిల్ నగరానికి ప్రధాన కూడలి కాగా, దాదాపు 68 ఏళ్లుగా ప్రతిష్టాత్మక ప్రాంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. 2014-19కాలంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక కృషితో డబుల్ ఫ్లైఓవర్ నిర్మాణం జరిగిందని, దాని వల్ల కొంతమేర ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమైనప్పటికీ రోజు రోజుకు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా మరిన్ని చర్యలు అవసరమని వివరించారు. చంద్రమౌళి నగర్, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు అటు నుంచి ఇటు వెళ్లేందుకు అనేక మార్గాలపై సూచనలు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ పోలీస్ అధికారులను కూడా కలుపుకొని సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాంధీ , కార్పొరేటర్లు చెన్నుపాటి క్రాంతి శ్రీ, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయి బాబు, టిడిపి నాయకులు నాగ మోతు రాజా, కె. వి. రమేష్, వై. వి. ఈశ్వర రావు, కె. వి. రామారావు, చెన్నుపాటి వజీరు, సత్యనారాయణ, చిలకలపూడి లక్ష్మణరావు,రమణ, లక్ష్మణ్ స్వామి,శరత్, చలపతిరావు, సూరపనేని సురేష్, టి. ఎన్. టి. యు. సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టి. ఎన్. ఎస్. ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

---

# విజయవాడలో పీఎంజే జువెల్స్ గ్రాండ్ "ది వరల్డ్స్ బిగ్గెస్ట్ జ్యువలరీ ఎగ్జిబిషన్" అతిపెద్ద జ్యువెలరీ ప్రదర్శనను సినీ నటి లయ ప్రారంభించారు

**విజయవాడ, ఫిబ్రవరి 27 మనం న్యూస్ :** 1964లో స్థాపించబడిన వారసత్వ ఆభరణాల సంస్థ పీఎంజే జువెల్స్, విజయవాడ లబ్బీపేటలోని ఎంజీ రోడ్డులో ఉన్న తాజ్ వివంతాలో మూడు రోజుల పాటు "హాఫ్-శారీ వెడ్డింగ్స్ అండ్ సెలబ్రేషన్స్" పేరిట "ది వరల్డ్స్ బిగ్గెస్ట్ జ్యువలరీ ఎగ్జిబిషన్" జ్యువెలరీ ప్రదర్శనను విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ ప్రదర్శన 2026 ఫిబ్రవరి 26 నుండి 28 వరకు కొనసాగుతుంది. కాబోయే వధూవరులు, హాఫ్ శారీ వేడుకలు జరుపుకునే యువతులు, వివాహాలు మరియు పండుగలకు సిద్ధమవుతున్న కుటుంబాల నుండి ఈ ప్రదర్శనకు భారీ స్పందన లభిస్తుందని భావిస్తున్నారు. ఇది నమ్మకం, సంప్రదాయం మరియు కళానైపుణ్యంతో కూడిన పీఎంజే వారసత్వాన్ని మరింత బలోపేతం చేస్తోంది.



నటి లయతో పాటు హైదర్ అలీ, స్టేట్ హెడ్ ర్రావీజీ జ్యువెల్స్ మోహన్ కృష్ణ, ర్రావీజీ జ్యువెల్స్ విజయవాడ స్టోర్ హెడ్ వారి వినియోగదారులు కలిసి గ్రాండ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్‌లో సితార హాఫ్ శారీ జ్యువెలరీ కలెక్షన్‌ను ప్రారంభించారు. పీఎంజే జువెల్స్ బ్రాండ్ అంబాసిడర్ సితార ఘట్టమనేని పేరు మీద రూపొందించిన ఈ కలెక్షన్ యువత, వారసత్వం మరియు ఆశయాల కలయికగా నిలుస్తుంది. విశ్వం మరియు దక్షిణ భారత ప్రకృతి నమూనాల నుండి ప్రేరణ పొందిన ఈ సితార కలెక్షన్, ప్రాచీన హస్తకళతో కూడిన క్లిష్టమైన డిజైన్లను కలిగి ఉంటుంది. ఇది హాఫ్ శారీ వేడుకను ఒక గర్వించదగ్గ సంప్రదాయ క్షణంగా మారుస్తుంది. ప్రస్తుతం జరుగుతున్న ఈ ప్రదర్శనలో డైమండ్ కలెక్షన్స్, రంగురాళ్ల (Gemstone) కళాఖండాలు మరియు సంప్రదాయ పోల్కీ ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇవి భారతీయ కళానైపుణ్యంతో పాటు ఆధునిక హంగు లను ప్రతిబింబిస్తాయి. వివాహాలు, పెళ్లికి ముందు మరియు తర్వాత జరిగే వేడుకలు, అలాగే హాఫ్ శారీ ఫంక్షన్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన విభిన్న ఆభరణాలను కుటుంబ సభ్యులు ఒకే చోట తిలకించవచ్చు. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా నటి లయ హర్షం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ.. "పీఎంజే జువెల్స్ వారి హాఫ్-శారీ వెడ్డింగ్స్ అండ్ సెలబ్రేషన్స్ ప్రదర్శనలో సితార హాఫ్ శారీ జ్యువెలరీ కలెక్షన్‌ను ప్రారంభించడం నాకు నిజంగా చాలా ఆనందంగా ఉంది. ఈ అద్భుతమైన సితార కలెక్షన్ పాతకాలపు వారసత్వాన్ని మరియు ఆధునిక సొబగులను మేళవించి ఆ వేడుక ప్రాముఖ్యతను చక్కగా ప్రతిబింబిస్తోంది. ఈ విశిష్టమైన వేడుక కోసం పీఎంజే జువెల్స్ ప్రత్యేకంగా ప్రపంచంలోనే అతిపెద్ద జ్యువెలరీ ప్రదర్శనను నిర్వహించడం అభినందనీయం. సందర్శకులు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ప్రయోజనాలను కూడా పొందవచ్చు. ప్రతి 3 లక్షల రూపాయల కొనుగోలుపై ఒక ఉచిత బంగారు నాణేన్ని అందిస్తూ, వారి వేడుకలను మరింత గుర్తుండిపోయేలా చేస్తున్నారు. భారతదేశం మరియు అమెరికా అంతటా విస్తరిస్తున్న పీఎంజే జువెల్స్, నమ్మకమైన ఫ్యామిలీ జ్యువెలర్‌గా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. సంప్రదాయం, హస్తకళ మరియు ఆధునిక హంగులను కలబోస్తూ ప్రతి బంధాన్ని కలకాలం గుర్తుండిపోయేలా ఈ సంస్థ తీర్చిదిద్దుతోంది.

---

# కష్టపడి చదువుకున్న ప్రతి విద్యార్థికి ఉజ్వల బౌషత్: ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



**హనుమాన్ జంక్షన్: పిబ్రవరి 27 ( మనం న్యూస్ ) :** విద్యా బోధనను సామాజిక బాధ్యతగా బావించి గత 25 సంవత్సరాలుగా క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్న విశ్వకవి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ యాజమాన్యం ముఖర్జీ,అనిత అభినందనీయులని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. శుక్రవారం విశ్వకవి సిల్వర్ జూబ్లీ వేడుకలు హనుమాన్ జంక్షన్ ఏలూరు రోడ్ లోని ఎస్. వి, కళ్యాణ మంటపం లో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ ఈ 25 సంవత్సరాల ప్రయాంలో విశ్వకవి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేసి ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దారని అన్నారు. వారంతా డాక్టర్స్ , ఇంజనీర్స్,ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ రంగాల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారని అన్నారు. ప్రైవేట్ ఆర్గనైజేషన్ లో స్కూల్ నడపటం మామూలు విషయం కాదన్నారు. విద్యార్థులు గమ్యం లేని జీవితాలను మార్చవద్దు. ఈ కార్యక్రమంలో జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్ బాబు, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి ,దయాల రాజేశ్వరరావు ,స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, అయ్యప్ప స్వామి దేవస్థానం చైర్మన్ నూలు నరసింహారావు, ఎంఇఓ రామ్ బాలా సింగ్ , కొమ్మా విజయ్ ,డెప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కొండా రవి కుమార్ , అప్పా స్టేట్ ప్రెసిడెంట్ గుళ్లపూడి మోహనరావు, డాక్టర్ నిడమర్తి లలిత కామేశ్వరి, అప్పా డెమొక్రాట్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ దుట్టా శివన్నారాయణ ,జమాతే ఇస్లాం ఇంఛార్జి షేక్ నసీర్, కాకులపాడు డి సి చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ , చలసాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే యార్లగడ్డ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాగా ఉదయం విశ్వకవి హైస్కూల్ లో కొమ్మినేని ముఖర్జీ,అనిత దంపతులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

---

# రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఆంధ్రరత్న భవన్ కు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.



**విజయవాడ సెంట్రల్ ఫిబ్రవరి 27 (మనం న్యూస్):** పీసీసీ మాజీ అధ్యక్షులు, సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజుకు కూడా ఆంధ్రరత్న భవన్ లో తన కుమారుడు సూర్య వివాహ శుభలేఖను అందించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి మేడా సురేష్, పీసీసీ ఉపాధ్యక్షులు గుర్నాథం, ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు లాం తాంతియా కుమారితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలకు కూడా కుమారుడి పెళ్లి ఆహ్వాన పత్రాలను అందించిన భట్టి విక్రమార్క, అందరూ తప్పక పెళ్లికి రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ముందుగా శ్రీ కనదుర్గమ్మ ఆలయానికి చేరుకున్న తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తెలంగాణ ఉప ముఖ్యమంత్రికి వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ అధ్యక్షులు, సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, పీసీసీ ప్రధాన కార్యదర్శి మేడా సురేష్ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

